

మధ్యాహ్నం మరింత నిఘా

● ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం

- పరిశీలనకు ఆహార భద్రత కమిటీలు
- ప్రతీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడితో పాటు ఇద్దరు టీచర్ల పరిశీలన
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు
- విద్యాధికారులకు ఉత్తర్వులు జారీ

విద్యాసంస్థల్లో విద్యార్థులకు మంచి రోజులు వచ్చాయి. నాణ్యమైన ఆహారం అందించేందుకు రుచి.. సుచి.. శుభ్రతకు గాను పర్యవేక్షణ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీల్లో ప్రిన్సిపాల్, వార్డెన్‌తో పాటు అక్కడ పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రతీ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు సభ్యులుగా ఉండేలా ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు శుభ్రత గురించి అవగాహన కల్పించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో ఇటీవల కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనలు జరిగాయి. వాటిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ బడులు, గురుకులాలు, కేజీబీవీ, వసతి గృహాలకు ఆహార భద్రత కమిటీలు ఏర్పాటు చేశారు. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల్లో ప్రిన్సిపాల్, వార్డెన్‌తో పాటు అక్కడ పని చేసే ఇద్దరు ఉపాధ్యాయులను, ప్రతీ తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు కమిటీలో సభ్యులుగా ఉండేలా ఈ కమిటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా ఉందా లేదా .. విద్యార్థులు తినే ముందు ప్రతి రోజూ చేతులు, ప్లేట్స్ శుభ్రంగా కడుగుతున్నారా లేదా...? కడుక్కుంటే విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రతిరోజు అవగాహన కల్పించాలి.

తరగతిలో ఉన్న విద్యార్థులకు ఆ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు శుభ్రత గురించి తెలియజేయాలి. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు భోజనం వండే ముందు వంట పాత్రలు సరిగా శుభ్రం చేశారా...? బియ్యం పూర్తిగా పరిశుభ్రంగా ఉన్నయా.. పురుగు లు, చెత్త లేకుండా వంట కార్మికులు జాగ్రత్తలు తీ సుకుంటున్నారా అన్న విషయాలపై దృష్టి పెట్టాలి. అంతే కాకుండా తాజా కూరగాయలు వాడే విధంగా వంట ఏజెన్సీలకు చెప్పాలి. అలా ఉంటేనే ఆ కూరగాయలు వండేలా చూడాలి. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించాలి. అలా నిత్యం ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పరిశీ లించాలి.. వండిన భోజనాన్ని ముందుగా ఉపాధ్యా యులు రుచి చూడాలి. ఆ తర్వాతనే విద్యార్థులకు (మిగతా 4వ పేజీలో...)



మహబూబ్‌నగర్‌లో ఓ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

● ఆహార భద్రత కమిటీల విధులు

ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆహార భద్రత కమిటీ ప్రతిరోజూ భోజనం వండేటప్పుడు అక్కడ ఉన్న బియ్యం, వంట సరకులు, నీటిని, వంట పాత్రలను పరిశీలించాలి. వస్తువులు నాణ్యతగా ఉన్నాయా లేవా చూడాలి. వంట గది శుభ్రంగా ఉండేలా చూడాలి. వండిన ఆహారాన్ని మొదట కమిటీ సభ్యు లు రుచి చూడాలి. భోజనం నాణ్యంగా ఉంటేనే విద్యార్థులకు వడ్డించాలి. విద్యార్థులు ప్లేట్స్ శుభ్రంగా కడుగుతున్నారా లేదా పరిశీంచాలి. కమిటీలో ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహించే సమయంలో ఫోన్‌లో ఫోటోలు తీసుకోవాలి. వాటిని భద్రపరచాలి. విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందిం చే యాప్‌లో వాటిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతి రోజూ పాఠశాలను పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనం పరిశీలించాలి. వారు విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచి చూడాలి.

రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు ఇవ్వాలి



మధ్యాహ్న భోజనం ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు రుచి చూసిన తర్వాతే విద్యార్థుకు భోజనం వడ్డించాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పాఠశాలల్లో ఆహార భద్రత కమిటీలు ఏర్పాటు చేశాం. ఈ కమిటీలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. మధ్యాహ్న భోజనం వండే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వీరికి ఆదేశాలు ఇచ్చాం.

\- ఎ.ప్రవీణ్‌కుమార్, డీఈవో మహబూబ్‌నగర్

'దిశ' లేని బతుకులు

- ఛిన్నాభిన్నమైన మృతుల కుటుంబాలు
- నేటితో చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌కు ఐదేళ్లు



చటాన్‌పల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్ వద్ద పోలీసు బలగాలు(ఫైల్)

మక్తల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఏం జరిగిందో తెలియదు... తెల్లారేసరికి వారి కుమారుల పేర్లు, ఫొటోలు మీడియాలో ప్రసారం అవుతున్నాయి... రాత్రి పొద్దు పోయాక వచ్చిన కుమారులు ఇళ్లలోనే ఉన్నారు... పోలీసులు వచ్చి దొరికిన వారిని దొరికినట్లు లాక్కెళ్లారు... రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలో ఓ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేశారని వారిపై ఆరోపణ... దీన్ని అర్థం చేసుకునే స్థితిలో కూడా ఆ కుటుంబాలు లేవు.... వారిని ఎన్‌కౌంటర్ చేయాలని రాష్ట్రం మొత్తం కోడై కూస్తోంది.. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న వారిని జన సమూహం చుట్టుముట్టింది. దీనికి మీరేమంటారంటే జవాబు కూడా ఇవ్వలేని అమాయక తల్లిదండ్రులు... సీన్ కట్ చేస్తే 2019 డిసెంబరు 6న 'దిశ' ఘటనలో ఎన్‌కౌంటర్... రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని చటాన్‌పల్లి దగ్గర సీన్ రీకన్‌స్ట్రక్షన్ సందర్భంగా జరిగిన ఘటన ఇది... నారాయణపేట జిల్లా జక్లేర్‌కు చెందిన ఆరీఫ్, గుడిగండ్లకు చెందిన జొల్లు శివ, చింతకుంట కేశవులు, జొల్లు నవీన్‌కుమార్ పోలీసు కాల్పుల్లో మృతి చెందారు.

ఈ ఘటనలో ఎవరిది తప్పు, ఎంతవరకు అన్నది కోర్టు పరిధిలోని అంశం. కానీ, ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలు మాత్రం ఆదెరువు కావాల్సిన కుమారులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. వారికి (మిగతా 4వ పేజీలో...)



ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో గుమికూడిన ప్రజలు(ఫైల్)

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

- పేట మార్కెట్‌లో వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పిన రైతులు
- నేడు యార్డులో వరి కొనుగోళ్ల నిలిపివేత

4



భూనీడు కొనుగోలు కేంద్రంలో కురిసిన వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

- హాజరైన మంత్రాలయ పీఠాధిపతులు
- సందడిగా మారిన మల్దకల్ ఆలయ ఆవరణ

4



కలశాలకు పూజలు చేస్తున్న పండితులు

మెరుగు పడుతున్న జీవితం

- మొదట్లో నెల వేతనం రూ.ఐదువేలు మాత్రమే
- ప్రస్తుతం రూ. 27 వేలకు చేరిన జీతం
- హోంగార్డుల ఉద్యోగాలకు పెరిగిన డిమాండ్
- 2014 నుంచి ఆగిపోయిన రిక్రూట్‌మెంట్

5





అలరించిన ఫ్యాషన్ షో


4

గద్వాల చీరలకు ప్రపంచ ఖ్యాతి

- అందరూ చేనేత దుస్తులు ధరించి ప్రోత్సహించాలి: కలెక్టర్ బీఎం సంతోష్
- అలరించిన యువత ఫ్యాషన్ షో

అస్వస్థతకు గురైన భూత్పూర్ పాఠశాల విద్యార్థినులు

- ఆసుపత్రిలో చేర్పించిన ఉపాధ్యాయులు



చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న డీఈవో

భూత్పూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల ప్రార్థనా సమయంలో కడుపులో నొప్పితో ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురై కింద పడిపోయిన ఘటన గురువారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కేంద్రంలో చోటుచేసుకున్నది. పాఠశాల ఉపాధ్యాయుల కథనం ప్రకారం ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మునిసిపాలిటీ పరిధిలోని జీఎఫ్‌సీ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రైవేటు హాస్టల్ ఉన్నది. ఈ హాస్టల్‌లో 30 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడి నుంచి ప్రతీ రోజు భూత్పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కొంత మంది, అమిస్తాపూర్ ప్రాథమిక పాఠశాలకు మరికొంత మంది విద్యార్థులు చదువుకోవడానికి వెళుతుంటారు. ఆరో తరగతి చదువుతున్న వి.మౌనిక, కె. మౌనిక అనే ఇద్దరు విద్యార్థినులు గురువారం భూత్పూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎప్పటిలాగే హాజరయ్యారు.

ఉదయం ప్రార్థనా సమయంలో ఆ ఇద్దరు విద్యార్థినులు తీవ్ర కడుపు నొప్పి అంటూ కింద పడిపోయారు. వారిని గమనించి పాఠశాల ఉపాధ్యాయులు రామస్వామి, లక్ష్మణ్‌నాయక్‌లు కలిసి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ డాక్టర్ లేక పోవడంతో ప్రథమ చికిత్స చేయించి అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్, ఏఎంవో దుంకుడు శ్రీనివాసులు, తదితరులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థినుల పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో ప్రవీణ్‌కుమార్ వైద్యులతో మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం ఆనందమ్మ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అస్వస్థతకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

- జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా మార్చి అత్యంత నాణ్యతతో కూడిన విద్యను అందించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. అందులో భాగంగానే అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి నూతన విద్యావ్యవస్థను అమల్లోకి తెచ్చాం. అంతేకాకుండా ఈ కేంద్రాల ద్వారా గర్భిణులకు కూడా పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం తెలిపారు. ఆమె గురువారం 'ఆంధ్రజ్యోతి'తో పలు విషయాలు తెలియజేశారు.

● పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..

ఈ ఏడాది నుంచి నూతన విద్యావిధానాన్ని అమల్లోకి తెచ్చాం. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలుగా పేరు మార్చాం. కొన్ని కేంద్రాలకు ఆకర్షణీయమైన రంగులు కూడా వేయించాం. అంతేకాకుండా మెరుగైన విద్యను అందించేందుకు అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించాం. బాల్యంలోనే చదువుపై పట్టు సాధించేందుకు పిల్లలను తయారు చేస్తున్నాం.

● అంగన్‌వాడీ టీచర్లకు ఎంతవరకు అవగాహన ఉంది

నూతన విద్యావిధానంపై రాష్ట్రస్థాయిలో కొంత మందికి శిక్షణ ఇప్పించాం. అక్కడ శిక్షణ తీసుకున్న మాస్టర్ ట్రైనర్లు జిల్లాలోని టీచర్లకు శిక్షణ ఇచ్చారు. వారికి కరదీపికలు కూడా ఇచ్చాం. బోధనా పద్ధతులు ఆ కరదీపికలో స్పష్టంగా ఉన్నాయి.

● ఏకరూప దుస్తులు ఎక్కడా కనిపించడం లేదు

జిల్లావ్యాప్తంగా మొదటి విడతలో ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ఉన్న 20 అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలను ఏర్పాటు చేశాం. వాటికే రంగులు వేయించాం. అక్కడ ఉన్న వారికి ఏకరూప దుస్తులు ఇచ్చాం. ఈ కార్యక్రమాన్ని అధికారికంగా త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం కాబోతుంది. అయితే అప్పటి వరకు నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తూనే ఉన్నాం.

● విద్యార్థులకు అందించే గుడ్లలో వ్యత్యాసం ఉంటోంది..

ప్రతి గుడ్డు కచ్చితంగా 50 గ్రాములు ఉండేలా చూస్తున్నాం. ఒకవేళ అంతకు మించి చిన్నవిగా ఉంటే వాటిని వెనక్కి పంపించాలని కూడా చెబుతున్నాం. దీనిపై ప్రతీ అంగన్‌వాడీ టీచర్ బాధ్యతగా ఉండాలని ఆదేశాలు ఇచ్చాం.

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, పక్కన స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, అడిషనల్ ఎస్.పి.రాములు, డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం సీఎం కప్ పోటీల సన్నద్ధతపై జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా అధికారులు, ఎంఈవోలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా ఈ నెల 7,8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో పోటీల నిర్వహణ ఉంటుందన్నారు. జిల్లా స్థాయి విజేతలు ఈ నెల 27 నుంచి 21 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సీఎం కప్‌కి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పోటీల నిర్వహణకు గ్రామ, మండల, జిల్లా కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి 36 క్రీడా అంశాల్లో పోటీలు ఉంటాయని డీవైఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, అడిషనల్ ఎస్.పి.రాములు, డీఈవో ప్రవీణ్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, డీవైఎస్‌వో శ్రీనివాస్, డీఐఈవో కౌసర్‌జహాన్, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.శ్రీనివాస్, డీపీవో పార్థసారథి, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్.పి.వెంకటేశ్, బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్, పీడీలు దూమర్ల నిరంజన్, జగన్‌మోహన్‌గౌడ్, బాల్‌రాజ్, విలియం, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు

- వంద కోడి గుడ్లకు రూ.650



నారాయణపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్ల ధరలు కొండెక్కాయి. జిల్లా వ్యాప్తంగా కోడిగడ్ల ధరలు పెరుగుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. వంద కోడి గుడ్ల ధరలు హోల్‌సెల్‌గా రూ.650 పలుకుతుండగా ఒక్క కోడిగుడ్డు పట్టణాల్లో రూ.7, గ్రామీణ ప్రాంతాల్లో రూ.ఏడున్నర పలుకు తున్నది. ఒకవైపు కోడి గుడ్డు ధర పెరుగుతుండటంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు పెరుగుతున్న ధరలు భారంగా మారుతున్నాయి. వారం రోజుల క్రితం వందకోడి గుడ్ల ధరలు రూ.600 పలకగా ప్రస్తుతం రూ.650కి పెరిగింది. దాంతో రిటైల్ కోడిగుడ్డు ధర రూ.ఆరున్నర నుంచి రూ.ఏడున్నర వరకు పెరిగింది. చలి కాలం కావడంతో ఉత్పత్తి అంతంత మాత్రంగానే ఉండటంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. మరోపక్క క్రిస్మస్, నూతన సంవత్సరం సమీపిస్తుండటంతో కేక్‌ల వినియోగం పెరుగుతాయి. ఈ ధరలు ఈ నెలాఖరు వరకు మరింత పె రిగే అవకాశం ఉందంటున్నారు.

ధరలు పెరగడంతో గిరాకీ అంతంతే..



వారం రోజుల్లో కోడిగుడ్ల ధరలు పెరిగాయి. క్రిస్మస్, నూతన సంవత్సరం సమీపిస్తుండటంతో కేక్‌ల తయారీ పెరుగుతుంది. మాల్ షాటేజీ ఉండటంతోనే ధరలు పెరుగుతున్నాయి. ధరలు పెరగడం వలన గిరాకీలు అంతంగానే ఉన్నాయి.

ఎండీ ఆరీఫ్, అమీర్ ఎగ్‌సెంటర్, నారాయణపేట

టీకీకరణ వందశాతం జరగాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీకీకరణ 100 శాతం జరగాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని సమావేశమందిరంలో ఇమ్యూనైజేషన్‌పై వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యాధి నిరోధక టీకీకరణ ప్రణాళిక ప్రకారం జరగాలని, ఏ ఒక్క పిల్లవాణ్ని కూడా వదలకుండా ప్రతీ ఒక్కరికి టీకాలు వేయాలన్నారు. అదేవిధంగా ఇదివరకు టీకాలు వేసే విషయంలో పుస్తకంలో నమోదు చేసేవారని, కాని తాజాగా ప్రభుత్వం కోవిడ్ టీకా మాదిరిగా ఇమ్యూనైజేషన్ సర్టిఫికెట్ కూడా తీసుకునే వెసలుబాటు కల్పించిందన్నారు.

అనంతరం టీకీకరణపై రాష్ట్ర ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మురారి, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధులు డాక్టర్ అజహర్, డాక్టర్ జోత్స్న, డాక్టర్ డేవిడ్ డమేరా, జిల్లా టీకాల అధికారి డాక్టర్ పద్మజా, మాస్ మీడియా అధికారి మంజుల, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్నం.. మరింత నిఘా

(మొదటిపేజీ తరువాయి)

భోజనం వడ్డించాలి. ఇది కొనసాగుతుండగా, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు ప్రతీ విద్యాసంస్థలను పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థలో ఈ కమిటీలు ఏర్పడ్డాయి. నిత్యం పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్నాయి.

● ఉమ్మడి జిల్లాలో ఇలా..

మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,227 ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నాయి. ఇందులో మూడు లక్షల పదివేల ఐదువందల ముప్పై ఎనిమిది మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు వారంలో మూడురోజుల (సోమ, బుధ, శుక్రవారాలు)లో గుడ్డు ఇస్తున్నారు. అదే విధంగా గురుకులాల్లో, కేజీబీవీల్లో, ఆదర్శ పాఠశాలల్లో ఉదయం టిఫిన్, మధాహ్నం భోజనం, రాత్రి భోజనం, ఇస్తున్నారు. ఇవి ప్రభుత్వం సూచించిన విధానంలో మెనూ ప్రకారం.. భోజనం ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయి.

ఇటీవల నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలో విద్యార్థులకు అందించే భోజనంపై ప్రభుత్వం అలర్ట్ అయింది. అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు.

● కమిటీలు ఏర్పాటు చేయడం మంచిదే



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చూసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఆహా ర భద్రత కమిటీలు వేయడం మంచి నిర్ణయమే. ఇందులో ఉపాధ్యాయులను, తరగతికి ఇద్దరు విద్యారులను కమిటీలో చేర్చారు. దీంతో పర్యవేక్షణ పెరుగుతుంది. కానీ ప్రభుత్వం నుంచి వచ్చే బియ్యం నాణ్యమైనవి అందించాలి.

- జగదీష్ కుమార్, జీహెచ్ఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రయాణం.. ప్రయాస

● బస్సు సౌకర్యం లేక కాలినడకనే పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు

● చదువు మానేస్తున్న మరికొందరు

● అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి



కాలినడకన పాతపాలెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కేటీదొడ్డి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల చాలామంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. కొంతమంది విద్యార్థులు సైకిళ్లపై, కొంతమంది కాలినడకనే 6 నుంచి 8 కిలోమీటర్ల దూరం వరకు నిత్యం పాఠశాలకు వెళ్లాల్సి వస్తుంది. చాలా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు 5 లేదా 7వ తరగతి వరకు మాత్రమే ఉన్నాయి. ఆ తరువాత చదవాలంటే ఇతర గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు వెళ్లాలి. కానీ మండలంలో చాలా గ్రామాలకు బీటీ రోడ్డు ఉన్నా బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. చదువు మానేసిన విద్యార్థులు గ్రామాల్లో తమ తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. మరికొంత మంది పేద కుటుంబాల విద్యార్థులు పట్టణాల్లో రోజువారీ కూలీ పనులకు వెళ్తున్నారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఇప్పటికే పలుమార్లు ఆయా గ్రామాల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కిలోమీటర్ల దూరం కాలినడనే పాఠశాలలకు...

కేటీదొడ్డి మండలంలో మొత్తం 23 గ్రామ పంచాయతీలు ఉండగా అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న కేటీదొడ్డి, నందిన్నె గ్రామాలపై మాత్రమే బస్సు వెళ్తుంది. మిగిలిన 21 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో చదువుతున్న విద్యార్థులు చాలా మంది 7వ తరగతి ముగిసిన తరువాత చదువు మానేస్తున్నారు. మండలంలో ఉన్న సోంపురం గ్రామంతో పాటు సుల్తాన్‌పురం, యర్సన్‌దొడ్డి గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆయా గ్రామాల నుంచి నందిన్నె గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లడానికి దాదాపు 8 కిలోమీటర్లకు పైగానే కాలినడకన వెళ్తున్నారు. అలాగే మల్లాపురం, మల్లాపురం తండా, కుచినెర్ల గ్రామాల విద్యార్థులకు కూడా దాదాపు 5 నుంచి 6 కిలోమీటర్ల దూరంలో నందిన్నె ఉంటుంది.

అలాగే గువ్వలదిన్నె, పూజారితండా విద్యార్థులు కూడా ఐదు కిలోమీటర్లు నడిచే వెళ్లాలి. నందిన్నెలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉండటంతో ఆయా గ్రామాల విద్యార్థులు నందిన్నె గ్రామానికి రావాలి. అలాగే మైలగడ్డ, గంగన్‌పల్లి, రంగాపురం, వెంకటాపురం, ఈర్లబండ తదితర గ్రామాల విద్యార్థులు కూడా పాతపాలెం, కొండాపురం, ఇర్కిచేడు గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు కాలినడనే వెళ్తున్నారు. కొంతమంది విద్యార్థులు మాత్రం సైకిళ్లపై వెళ్తున్నారు. నిత్యం విద్యార్థులు కిలోమీటర్ల దూరం నడిచి పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల వదిలిన తర్వాత సాయంత్రం కాలినడకన ఇంటికి వెళ్లేసరికి చీకటి పడుతుంది. చదువు కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించి ప్రజాప్రతి నిధులు, అధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం పాఠశాల సమయంలోనైనా ఒక బస్సును ఆయా గ్రామాల మీదుగా నడిచే విధంగా చూడాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● రోజూ నడిచే వెళ్లాలి



బడికి రోజూ నడిచే వెళ్లాలి. బడికి ఆలస్యంగా వెళ్లడం వల్ల మొదటి పీరియడ్ కొంత వరకు అయిపోతుంది. దీంతో ఆ సబ్జెక్ట్ అర్థం కాదు. సాయంత్రం ఇంటికి వెళ్లే సరికి ఆలస్యం అవుతుంది. ఇంటి దగ్గర చదువుకోలేక పోతున్నాం. అధికారులు బడి సమయంలోనైనా బస్సును ఏర్పాటు చేసి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలి.

- (సాధిక్, 8వ తరగతి, గంగన్‌పల్లి)

● బస్సులు లేని గ్రామాల విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వాలి



అధికారులు గ్రామాలకు బస్సులు నడపనప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వాలి. సైకిల్ ఉంటే పాఠశాలకి సమయానికి వెళ్తాం. రోజూ కిలోమీటర్ల దూరం ఉదయం, సాయంత్రం నడవడం వల్ల అలసిపోయి చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నాం.

- నరేంద్ర, 8వ తరగతి, నీలహళ్లి

పాఠశాలకు చేరిన బియ్యం

● స్పందించిన అధికారులు ● తీరిన విద్యార్థుల ఆకలి



దోమలపెంట పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

దోమలపెంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల క్రితం దోమలపెంట ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో బియ్యం లేక మధ్యాహ్న భోజనం నిలిపి వేయడంతో విద్యార్థులు పస్తులుంటున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో గురువారం ప్రచురితం కావడంతో ఎట్టకేలకు జిల్లా అధికారులు స్పందించారు. పాఠశాలకు నవంబరు నెల 2 క్వింటాళ్లు, డిసెంబరు నెలకు సంబంధించి 2.5 క్వింటాళ్ల బియ్యం పాఠశాలకు చేరాయి. విద్యార్థుల పస్తులపై జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ స్పందిస్తూ ఇకపై జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన రుచికరమైన భోజనం పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామని, త్వరలోనే అమ్రాబాద్ మండలంలో పాఠశాలలనూ తనిఖీ చేస్తామనిని ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దోమలపెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగయ్య విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసేందుకు తన సొంత ఖర్చులతో వంట సరకులు తెప్పించారు. పాఠశాల విద్యార్థులకు భోజనం సమస్య తీరినందుకు 'ఆంధ్రజ్యోతి'కి విద్యార్థుల తల్లిదండ్రులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్, మాజీ ఉపసర్పంచ్ బుదాల ప్రసాద్, సిరాజ్, గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

'దిశ' లేని బతుకులు

(మొదటిపేజీ తరువాయి)

దిశ చూపే వారి కోసం ఎదురు చూస్తున్నాయి. సంఘటన జరిగి ఐదేళ్లు గడిచిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' గురువారం గుడిగండ్ల, జక్లేర్ గ్రామాల్లోని బాధిత కుటుంబాలను కలిసి మాట్లాడి వారి స్థితి గతులను తెలుసుకున్నది. వివరాలు వారి మాటల్లోనే...

కొడుకుపై బెంగతో మా ఆయన చనిపోయాడు



బూటకపు ఎన్‌కౌంటర్‌తో మా కుమారుడు జొల్లు శివను పొట్టన పెట్టుకున్నారు. కుమారుడు మరణించాడనే దిగులుతో మా ఆయన కూడా మృతి చెందాడు. నాకు కనీసం వితంతు పెన్షన్ కూడా రావడం లేదు.. వృద్ధాప్యం కారణంగా కూలి పనులు సైతం చేసుకోలేక ఇబ్బంది పడుతున్నాను. ఉండేందుకు ఇల్లు లేకపోవడంతో రేకుల షెడ్‌లో నివాసం ఉంటున్నాను.

- జొల్లు శివ తల్లి మణెమ్మ, గుడిగండ్ల.



వృద్ధాప్యంతో ఆదుకునేవారు లేరు

దిశ ఎన్‌కౌంటర్‌తో ఉన్న ఒక్కగానొక్క కుమారుడ్ని (ఆరీఫ్) కోల్పోయాం. ప్రస్తుతం మేము నివసించే పెంకుటిల్లు శిథిలావస్థలో ఉన్నది. మాకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. దినసరి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. బూటకపు ఎన్‌కౌంటర్‌తో మా కుమారుడ్ని పొట్టన పెట్టుకున్నారు.

ఇంత వరకు మాకు ఎలాంటి సహాయం అందించలేదు. వృద్ధాప్యంతో ఆదుకునేవారు లేరు. ఇప్పటికైనా ప్రభుత్వం మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

- ఆరిఫ్ తండ్రి హుసేన్, మౌలాన్‌బీ, జక్లేర్

జీవనం దుర్భరంగా మారింది



ఐదేళ్ల క్రితం మా కుమారుడు చెన్న కేశవులును పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో పొట్టన పెట్టుకున్నారు. కుమారుడు చనిపోయిన మూడు నెలలకే నా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎన్‌కౌంటర్ సమయంలో చెన్నకేశవులు భార్య గర్భవతి. కోడలు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. ప్రస్తుతం ఐదేళ్ల మనవరాలితో ఇంట్లో నివాసం ఉంటున్నాం. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. జీవనం దుర్భరంగా మారింది, ఇప్పటికైనా మా కుటుంబానికి న్యాయం చేయాలి.

- చింతకుంట కేశవులు తల్లి జయమ్మ

మా కుటుంబాన్ని ఆదుకోవాలి



ఎన్‌కౌంటర్ పేరుతో మా కుమారుడు జొల్లు నవీన్‌కుమార్‌ను పోలీసులు అకారణంగా చంపేశారు. తమ కుమారుడు తప్పు చేసి ఉంటే శిక్షలు వేయడానికి కోర్టులు ఉన్నాయి. కానీ, ఎవరో చేసిన తప్పులకు మా పిల్లవాడ్ని బలిచేశారు. ఎన్‌కౌంటర్ చేసి ఐదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు అతీగతీ లేదు. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ పేరుతో ఎన్‌కౌంటర్ అధికారులను కఠినంగా శిక్షించి మా కుటుంబానికి న్యాయం చేయాలి.

- జొల్లు నవీన్‌కుమార్ తల్లి లక్ష్మి

గద్వాల చీరలకు ప్రపంచ ఖ్యాతి

» అందరూ చేనేత దుస్తులు ధరించి ప్రోత్సహించాలి

» కలెక్టర్ బీఎం సంతోష్

» అలరించిన యువత ఫ్యాషన్‌షో



తెలంగాణ తల్లి వేషధారణలో విద్యార్థిని



ఫ్యాషన్ షోలో చేనేత చీర ధరించిన యువతి

గద్వాల న్యూటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు, చేనేత వస్త్రాలు ధరించి మార్పును చూపించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం ఐడీవోసీ సమావేశపు హాలులో ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయరంగం తర్వాత చేనేత రంగం రెండవ స్థానం ఆక్రమించిందని, గద్వాల చేనేత చీరలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఖ్యాతి పొందాయని తెలిపారు. భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్) కూడా సాధించిందన్నారు. చేనేత రంగ కార్మికులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొత్త పథకాలు అమలు చేస్తుందన్నారు. జిల్లాలో చనిపోయిన పది మంది నేత కార్మికులకు చేయూత అందించేందుకు చేనేత బీమా పథకం కింద రూ.5లక్షల చొప్పున ఆర్థికసాయం అందించడం జరిగిందన్నారు. అంతకుముందు కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చీరల స్టాళ్లను ప్రారంభించి, వాటి ప్రత్యేక డిజైన్లను చూసి స్థానిక చేనేత కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఫ్యాసన్ షో అందరిని అలరించాయి. అనంతరం వ్యాసరచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులకు రూ.6.05 కోట్ల పావలా వడ్డీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, చేనేత జౌళి సంచాలకుడు గోవిందయ్య, ఉప సంచాలకులు నాగలత, భిక్షపతి, కాంతమ్మ, చేనేత కార్మికులు ఉన్నారు.

లంచం అడిగితే సమాచారమివ్వండి



ఏసీబీ డీఎస్పీ బాలక్రిష్ణ

మహబూబ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధకశాఖ మహబూబ్‌నగర్ డీఎస్పీగా సీహెచ్ బాలకృష్ణ నియమితులయ్యారు. ఏసీబీ డీజీపీ కార్యాలయం నుంచి మహబూబ్‌నగర్‌కు వచ్చారు. ఆయన గురువారం బాధ్యతలు తీసుకున్నారు. వికారాబాద్ జిల్లా తాండూర్‌కు చెందిన ఈయన 1998 బ్యాచ్ ఎస్ఐగా ఎంపికయ్యారు. పోలీస్‌శాఖలో వరంగల్ ఎస్ఐగా పనిచేశారు. ఆ తరువాత సైబరాబాద్, గచ్చిబౌళి సీఐగా, అంబర్‌పేట, చిక్కడపల్లిలో సీఐడీ ఇన్‌స్పెక్టర్ పనిచేసి, ఖమ్మం ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగారు. డీఎస్పీగా పదోన్నతి పొంది ఏసీబీ డీజీపీ కార్యాలయంలో ఉన్న ఆయన మహబూబ్‌నగర్ ఏసీబీ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఇది వరకు డీఎస్పీగా పనిచేసిన కృష్ణ గౌడ్ బదిలీ కాగా, కొద్ది రోజులుగా ఆయనే జిల్లా ఇన్‌చార్జి డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిం చారు. ఎట్టకేలకు రెగ్యులర్ డీఎస్పీని కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతి రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అవినీతి నిర్మూలనకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ సేవలకు ప్రజలు లంచం ఇవ్వకూడదని, ఎవరైనా అలా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మట్టిలో కూరుకుపోయిన పీడీఎస్ బియ్యం లారీ

- లబ్ధిదారుల అవస్థలు



కూరుకుపోయిన పీడీఎఫ్ బియ్యం లోడు లారీ

బిజినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీడీఎస్ బియ్యం గోదాం నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం తీసుకెళ్లే లారీ మట్టిలో కూరుకుపోయింది. పీఏసీఎస్ భవనం పక్క రోడ్డుపై పారుతున్న మురుగులో దిగిపోగా, లారీని ఎక్స్‌కవేటర్ సహాయంతో తీసే ప్రయత్నం చేసినా బయటకు రాలేదు. మరో లారీకి కొన్ని సంచులను ఎక్కించి ఆయా గ్రామాల్లోని రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేపట్టారు. రెండు రోజుల పాటు సరఫరా కొన్ని గ్రామాలకు ఆగిపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలోనే రోడ్డు పరిస్థితి ఇంత అధ్వానంగా ఉంటే మారుమూల గ్రామాల్లో అంతర్గత రోడ్ల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుందని పలువురు అంటున్నారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ ఆర్ఎం



సంతోష్‌కుమార్

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా పీ. సంతోష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి రీజినల్ డిప్యూటీ ఆర్ఎంగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై మహబూబ్‌నగర్ ఆర్ఎంగా వచ్చారు. గతంలో 10 పదేళ్ల డిపో మేనేజర్‌గా, కార్గో బిజినెస్ హెడ్‌గా, డిప్యూటీ ఆర్ఎంగా రంగారెడ్డి, హైదరాబాద్ సిటీ, మెదక్‌లో విధులు నిర్వహించారు. అదేవిధంగా ఛాంబర్‌లో ఐఎన్‌టీయూసీ, ఎస్‌డబ్ల్యూ నాయకులు అహ్మద్ ఖాన్, విజయబాబు, సుందర్‌రాజ్, సాయిరెడ్డి, బాలయ్య, జనార్దన్, మల్లయ్య, శ్రీను పలువురు సన్మానించారు.

వ్యక్తికి గాయాలు

చారకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జూపల్లి సమీపాన బుధవారం రాత్రి కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఎస్ఐ శంషుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... జూపల్లికి చెందిన మాడ్గుల హుసేన్ కల్వకుర్తి పట్టణంలోని గురుకుల కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని బైక్‌పై వస్తుండగా, జూపల్లి సమీపాన రోడ్డుపై ట్రాక్టర్ ట్రాలీ నిలిపి ఉండడంతో వెనకాల ఢీకొట్టడంతో హుసేన్ తలకు, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

నారాయణపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం అర గంటపాటు వర్షం కురిసింది. దాంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసి పోయింది. అధికారులు అప్రమత్తమై వరి కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పడంతో అడుగు భాగంలో కొంత మేర ధాన్యం తడిసింది. అయితే యార్డులోని వ్యాపారస్తులకు సంబంధించిన నాలుగువేల వరి బస్తాలు తడిసినట్లు తెలిపారు. సాయంత్రం మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివారెడ్డి, కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్, డైరెక్టర్ శరణప్ప పరిశీలించారు.



పేట మార్కెట్ యార్డులో తడిసిన వరి బస్తాలు



మార్కెట్ యార్డులో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తిపోస్తున్న రైతు

రైతులు తెచ్చిన ధాన్యానికి టెండర్లు జరిపినా వర్షం వల్ల తూకాలు చేయకపోవడంతో శుక్రవారం జరుగుతాయని రైతులకు తెలిపారు. కాగా శుక్రవారం యార్డులో వరి కొనుగోళ్లు నిలిపివేస్తున్నామని, రైతులు ఎవరూ ధాన్యం తీసుకురాకుండా సహకరించాలన్నారు. కందుల కొనుగోళ్లు యథావిధిగా జరుగుతాయన్నారు. ధాన్యం తడవడంతో వ్యాపారులతో మాట్లాడారు. ఎప్పటికప్పుడు ధాన్యం తరలించేలా చూసుకోవాలన్నారు. యార్డులో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని నిలిపేందుకు రైతులు అష్టకష్టాలకు లోనయ్యారు.

నీట మునిగిన క్రీడా మైదానం

జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం వర్షపు నీరు నిలిచి కుంటలా తయారైంది. వర్షం కురిస్తే చాలు సగభాగం నీరు నిలుస్తుండడంతో క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్తపల్లి: మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములతో కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసింది. కల్లాలతో పాటు కొనుగోలు కేంద్రాల్లో, పలు చోట్ల ధాన్యం తడిసి ముద్దయింది. నాలుగు నెలలుగా కష్టపడి పండించిన పంట నేలపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



మహా కుంభాభిషేకంలో పాల్గొన్న పీఠాధిపతులు

మల్దకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదిశిలా క్షేత్రం మల్దకల్ స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం మహాకుంభాభిషేకం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రాలయ పీఠాధిపతులు సుబుదేంద్ర తీర్థస్వామి హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా మహాకుంభాభిషేకం, సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి, మధ్వాచార్యుల, ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ఠలు చేశారు. ఆలయ ఛైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పండితులు హోమ కార్యక్రమాలు చేపట్టారు. అంతకుముందు మంత్రాలయం పీఠాధిపతులను బస్టాండ్ నుంచి ఆలయం వరకు అశ్వవాహనంపై ఊరేగింపుగా ఘన స్వాగతం పలికారు.

ఉపాధ్యాయుడి వేధింపులతో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

అచ్చంపేటటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుడి వేధింపులను తట్టుకోలేక ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న విద్యార్థి తల్లిదండ్రులు రాతపూర్వకంగా గురుకుల సెక్రటరీకి గురువారం ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం అచ్చంపేట పట్టణంలోని సాంఘిక గురుకుల పాఠశాలలో ఒకే పేరుతో 8వ తరగతిలో ఇద్దరు విద్యార్థులున్నారు. వారి తండ్రుల పేర్లు మాత్రం వేర్వేరుగా ఉన్నాయి. అందులో ఓ విద్యార్థి చెడు తిరుగుళ్లకు అలవాటు పడి, దొంగతనాలు చేసి పోలీసు కేసుల్లో కూడా ఉన్నాడు. దీంతో అతని పేరుతో ఉన్న ఈ విద్యార్థే అతను అనుకొని హౌస్‌మాస్టర్, క్లాస్ టీచర్ ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. దొంగ అనే నింద మోపి మానసికంగా ఇబ్బందులకు గురి చేశారు. దీంతో తన సొంత గ్రామమైన బోల్గెట్‌పల్లిలో బుధవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. తమ కుమారుడు పాఠశాల నుంచి వెళ్ళిపోయి నాలుగైదు రోజులు అయినా హౌస్ మాస్టర్, క్లాస్ టీచర్ పాఠశాలలో లేడని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని వారు వాపోయారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురుకుల సెక్రటరీకి ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్ రికార్డులో తమ కుమారుడి సమాచారం తప్పుగా నమోదు చేశారని, చదువును బలవంతంగా మాన్పించారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజయ్యను వివరణ కోరగా ఆ విద్యార్థి మూడు సంవత్సరాలుగా చాలా సార్లు చెప్పకుండా పాఠశాలను ఎగ్గొట్టి ఇంటి వద్దే ఉంటున్నాడన్నారు. దీనికి సంబంధించిన అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. విద్యార్థిని ఇబ్బందులకు గురి చేశారనడంలో నిజం లేదన్నారు.

కల కన్నారు.. కష్టపడ్డారు..

కొలువు సాధించారు

ప్రభుత్వ ఉద్యోగం సాధించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలలు కన్నారు. గ్రూప్స్‌లో విజయం సాధించడమే ధ్యేయంగా రేయింబవళ్లు కష్టపడి చదువుకున్నారు. వారి కష్టానికి తగిన ఫలితం లభించింది. గూప్-4లో సత్తా చాటి, ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన యువ వికాసం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' వారిని పలుకరించి, సంతోషాన్ని పంచుకున్నది. వివరాలు వారి మాటల్లోనే..

- నారాయణపేట, మక్తల్ రూరల్, గద్వాల న్యూటౌన్
మహబూబ్‌నగర్ విద్యావిభాగం (ఆంధ్రజ్యోతి)



చాలా ఆనందంగా ఉంది

ఇన్నాళ్లు నేను పడ్డ కష్టానికి తగిన ఫలితం దక్కింది. మునిసిపాలిటీలో వార్డు అధికారిగా ఉద్యోగం వచ్చింది. అంతే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకోవడం మరింత సంతోషం కలిగించింది. బాధ్యతగా విధులను నిర్వర్తిస్తూ, ఉద్యోగానికి న్యాయం చేయడమే నా ధ్యేయం.

- నవీన, కొండాపూర్, ధన్వాడ మండలం.

కల సాకారం అయ్యింది



ఎంతో కాలంగా కంటున్న కల సాకారం అయ్యింది. మునిసిపాలిటీలో వార్డు అధికారిగా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ నియామక పత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం చాల సంతోషంగా ఉంది. నాకు వచ్చిన ఉద్యోగానికి న్యాయం చేస్తాను.

- దినేష్‌రెడ్డి, కొండాపూర్, ధన్వాడ మండలం.



కానిస్టేబుల్‌గా పని చేస్తూనే..

నేను కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తునే మరో ఉద్యోగం కోసం సిద్ధం అయ్యాను పరీక్ష రాసి విజయం సాధించడం చాల సంతోషంగా ఉంది. నాకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగ నియమక పత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నందుకు చాలా గర్వపడుతున్నాను.

- రవికుమార్, కొండాపూర్, ధన్వాడ మండలం.

కష్టపడి చదివా.. పోస్టు సాధించా



కష్టపడి చదివి గ్రూప్-4లో సత్తాచాటుకొని, మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో వార్డు ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాను. ఉద్యోగం రావడంతో ఎంతో సంతోషంగా ఉంది. నేను గ్రూప్-1 కూడా రాశాను. ఆ ఉద్యోగం కూడా తప్పకుండా వస్తుంది. అమ్మానాన్నలు వెంకట్రామిరెడ్డి, కళావతి ప్రోత్సాహంతో విజయం సాధించాను.

- ఎస్. కీర్తి, మహబూబ్‌నగర్, శ్రీనివాసకాలనీ.



ఉన్నతోద్యోగం సాధించడమే లక్ష్యం

నేను ప్రస్తుతం కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాను. పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్స్‌కు సిద్ధమయ్యాను. గ్రూప్-4లో విజయం సాధించడంతో, రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. ఇంకా ఉన్నత ఉద్యోగం ప్రయత్నిస్తాను. గ్రూప్స్-1, 2 సాధించడమే లక్ష్యంగా పరీక్షలకు సిద్ధం అవుతున్నాను.

- కె.భాస్కర్, కర్ని, మక్తల్ మండలం.

యూట్యూబ్‌లో క్లాసులు విని..



గతంలో ఒక సారి శిక్షణ తీసుకొని ఇంటి వద్దే ఉండి పరీక్షకు సిద్ధమయ్యాను. సిలబస్‌పై అవగాహన పెంచుకొని యూట్యూబ్‌లో వీడియో క్లాసులు విని, నోట్స్ ప్రిపేర్ చేసుకున్నాను. ప్రతీ రోజు ఆరు గంటల పాటు ప్రణాళికా బద్ధంగా చదివి ఓపెన్ కేటగిరీలో గ్రూప్-4 జాబ్ కొట్టాను. భవిష్యత్తులో సివిల్స్ సాధించమే లక్ష్యం.

- సి.లోకేష్, తాడూరు, నాగర్‌కర్నూల్ జిల్లా.



మొదటి ర్యాంకు సాధించా..

గ్రూప్- 4 పరీక్షల్లో జిల్లా మొదటి ర్యాంక్ సాధించాను. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నాను. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎస్డీవో కార్యాలయంలో జూనియర్ అకౌంటెంట్‌గా బాధ్యతలు స్వీకరించాను.

- రుక్సానా బేగం, గద్వాల.

క్రైం కార్నర్

లోన్ యాప్ పేరుతో రూ. 33 వేలు స్వాహా

వీపనగండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : లోన్ యాప్ పేరుతో ఓ వ్యక్తి రూ. 33 వేలు పోగొట్టుకున్నాడు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాణి గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆలకుంట రాముడుకు ఫేస్‌బుక్‌లో ధనీ లోన్ యాప్ పేరుతో ఓ నోటిఫికేషన్ వచ్చింది. డబ్బులు అవసరం ఉన్న ఆయన రెండు మూడు లక్షల రూపాయలు లోన్ కావాలంటూ, నోటిఫికేషన్‌లో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేశాడు. ప్రాసెసింగ్ చార్జీల పేరుతో రూ. 6,500 తీసుకున్నారు. అలాగే మళ్లీ మళ్లీ డబ్బులు వేయించుకొని మొత్తంగా రూ. 33,500 వసూలు చేశారు. ఆ తర్వాత ఫోన్ చేసినా వారు స్పందించ లేదు. దీంతో తాను మోసపోయి నట్లు గ్రహించి, పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాల వాడకు చెందిన వివాహిత కాకునూరి తిరుపతమ్మ (28) అదృశ్యం అయినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తిరుపతమ్మ ఈ నెల మూడవ తేదీన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె భర్త ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

వీపనగండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల పరిధిలోని గోపాల్‌దిన్నెలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాణి తెలిపారు. రిజర్వాయర్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీస్ సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. అక్కడున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 9,190, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.



మెరుగుపడిన జీవితం

» సమాజంలో పెరుగుతున్న గౌరవం » మొదట్లో నెల వేతనం ఐదువేలు మాత్రమే
» ప్రస్తుతం రూ. 27 వేలకు చేరిన జీతం » ఉద్యోగాలకు పెరిగిన డిమాండ్
» 2014 నుంచి ఆగిపోయిన రిక్రూట్‌మెంట్ - నేడు హోంగార్డుల దినోత్సవం

మహబూబ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు హోంగార్డులు అంటే పోలీస్ అధికారులకు సేవకులుగా భావించేవారు. ఇంటిపని, వంటపని అన్నీ వారితోనే చేయించుకునే వాళ్ళు. అరకొర జీతం ఇచ్చి వెట్టిచాకిరి చేయించుకునే వారు. ఒక రకంగా చెప్పాలంటే తోటమాలిగానో.. ఇంట్లో వంట మనిషిగానో.. పిల్లలను చూసుకొనే ఆయాగానో పని చేయాల్సి వచ్చేది. ఈ పరిస్థితి నచ్చక కొందరు ఉద్యో గం వదిలి వెళ్లిపోయేవారు. మరికొందరు గత్యంతరం లేని పరిస్థితిల్లో డ్యూటీ చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. వేతనం కూడా పెరిగింది. వారిని స్టేషన్ విధులు, బందోబస్తుకు వినియోగించుకుం టున్నారు. చాలామంది హోంగార్డులు అధికారులకు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఆర్డర్లీ వ్యవస్థ పూర్తి స్థాయిలో పోలేదు, కానీ గతంతో పోలిస్తే చాలా వరకు తగ్గింది. హోంగార్డులంటే గౌరవమూ పెరి గింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 770 పోస్టులకు గాను ప్రస్తుతం 672 మంది పనిచేస్తున్నారు. మరో 98 ఖాళీలున్నాయి.

భర్తీ కాని ఖాళీ పోస్టులు

ఒకప్పుడు ఉన్నతాధికారులు నేరుగా తమకు నచ్చిన వారిని హోంగార్డులుగా నియమించేవారు. రానురాను డిమాండ్ పెరగడంతో కానిస్టేబుల్ తరహా లో హోంగార్డులను కూడా రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేస్తున్నారు. ఇది కూడా 2014 నుంచి ఆగి పోయింది. చివరి సారి పదేళ్ల క్రితం రిక్రూట్‌మెంట్ జరిగింది. ఆ తరువాత ఖాళీ అయిన వారి స్థానంలో కొత్త వారిని కూడా తీసుకోవడం లేదు.

జీతం పెరగడంతో డిమాండ్

హోంగార్డులకు తొలుత ప్రతీనెల ఐదు వేల రూపాయల జీతం ఇచ్చేవారు. దినసరి వేతనం కావడంతో ఏ రోజైనా డ్యూటీకి హాజరు కాకపోతే కట్ చేసేవారు. పని చేసిన దినాలను లెక్కించి ఇచ్చేవారు. ఆ తరువాత జీతం తొమ్మిది వేలకు పెరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.12 వేలకు పెంచారు. 2018లో ఒకేసారి రూ.20 వేలకు పెరగడంతో హోంగార్డులకు గౌరవం లభించడంతో పాటు, పోస్టులకు డిమాండ్ పెరిగింది. పెరిగిన జీతంతో పాటు ప్రతీ సంవత్సరం వెయ్యి రూపాయల ఇంక్రిమెంట్ ఇస్తామని ప్రకటించింది. అన్నట్లుగానే మూడేళ్ల పాటు వెయ్యి రూపాయల చొప్పున జీతం పెంచింది. 2021లో పీఆర్సీ ప్రకారం 30 శాతం పెంచుతామని ప్రకటించి, కొంత మేరకు అమలు చేయడంతో జీతం రూ.27 వేలకు చేరింది. అప్పటి నుంచి అదే వేతనం కొనసాగుతోంది. కాగా 15 ఏళ్ల క్రితం హోంగార్డుల వేతనాలు రూ.5 వేలు ఉన్న సమయంలో చాలా మంది ఉద్యోగం మానుకొని వెళ్ళిపోయారు. ఇప్పుడు వేతనం పెరగడంతో, వారంతా మా ఉద్యోగాలు మాకివ్వాలంటూ ప్రగతిభవన్ చుట్టూ తిరుగుతున్నారు. వారిలో చాలా మంది వయస్సు 50 దాటడంతో ప్రభుత్వం కూడా చేతులెత్తేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాల వారీగా హోంగార్డుల వివరాలు

జిల్లా	పోస్టులు	ఉన్నవారు	ఖాళీలు
మహబూబ్‌నగర్	209	182	27
నాగర్‌కర్నూల్	177	148	29
వనపర్తి	137	126	11
గద్వాల	131	111	20
నారాయణపేట	116	105	11
మొత్తం	770	672	98

పరిష్కారం కాని సమస్యలు

హోంగార్డుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేయక పోవడంతో ఉన్న వారిపై పని భారం పెరుగుతోంది. వీరికి షిఫ్టుల ప్రకారం డ్యూటీ ఉండటం లేదు. ఎవరైనా హోంగార్డు చనిపోతే అతడి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని చాలా కాలంగా కోరుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. ఆరోగ్య భద్రత కార్డు ఇచ్చి, ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని వారు కోరుతున్నారు. ఆరోగ్యభద్రత లేక పోవడం వల్ల చాలా మంది జీతంలో ఎక్కువ మొత్తాన్ని వైద్యానికే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తూ, బస్‌పాస్ ఇవ్వాలని కోరుతున్నా అమలు కావడం లేదు. చనిపోయిన హోంగార్డులకు ఖర్చుల కోసం ఇస్తున్న రూ.10 వేలకు పెంచా లని డిమాండ్ చేస్తున్నారు. పీఎఫ్ ఇవ్వాలని, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని, బందోబస్తు, ఎన్నికల విధుల సమయంలో విధులు నిర్వరించిన వారికి అలవెన్స్‌లు ఇవ్వాలన్న డిమాండ్లు కూడా ఉన్నాయి. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, కానిస్టేబుళ్ళతో సమానంగా గుర్తింపు, గౌరవం ఇవ్వాలని హోంగార్డులు కోరుతున్నారు.

మరో పిల్లల మర్రి

» ఊడలతో ఎకరానికి పైగా విస్తరించిన వృక్షం
» చెట్టు నీడన కొలువు దీరిన బీరప్ప స్వామి
» సెలవు రోజుల్లో పర్యాటకుల సందడి

అచ్చంపేట, డిసెంబరు 5 : పాలమూరు పేరు చెప్పగానే ఎవరికైనా పిల్లల మర్రి గుర్తుకొస్తుంది. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ మరో పిల్లల మర్రి ఉంది. దాదాపు ఎకరానికి పైగా విస్తరించిన ఈ వృక్షం అచ్చంపేట - నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిలో జిన్‌కుంట స్టేజీ నుంచి పోలేపల్లి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. మర్రి చెట్టు ప్రధాన మాను వద్ద బీరప్ప ఆలయం కూడా ఉంది. అక్కడ కురువ గొల్లలు ప్రతీ రోజు పూజలు చేస్తూ ఉంటారు. గతంలో కొందరు ఈ చెట్టును కొంత మేర కొట్టివేశారు. లేకపోతే మరింతగా విస్తరించి ఉండేది. సెలవు రోజుల్లో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు, పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి, బీరప్ప స్వామిని దర్శించుకొని, మర్రి చెట్టు కింద సేద తీరుతుంటారు. ప్రభుత్వం, పర్యాటక శాఖ అధికారులు స్పందించి ఈ ప్రాంతంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దీని వల్ల స్థానికులకు కూడా ఉపాధి లభిస్తుందని చెప్తున్నారు.



పోలేపల్లి సమీపంలో ఎకరానికి పైగా విస్తరించిన ఉన్న మర్రి చెట్టు

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి

» ఆదిపరాశ్రీ స్వామిజీ » హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
» బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసన

నారాయణపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని, అందుకోసం అందరూ జాగరూకులు కావాలని ఆదిపరాశ్రీ స్వామీజీ అన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా నారాయణపేట పట్టణంలో గురువారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అవదూత నరసింహ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ హరే కృష్ణ.. హరే రామ.. శ్రీరామ నామ సంకీర్తనల నడుమ ప్రధాన రహదారి మీదుగా సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. అయ్యప్ప స్వాములు, హిందూ సంఘాల నాయకులు, ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో రెండు గంటల పాటు దుకాణాలను మూసివేసి ర్యాలీలో భాగస్వాములయ్యారు. అనంతరం సత్యనారాయణ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిపరాశ్రీ స్వామిజీ మాట్లాడుతూ భారతదేశం ముమ్మాటికి హిందువులదేనన్నారు. భారతదేశానికి ఆపద వస్తే ఆదుకునేందుకు ప్రపంచంలో ఏ హిందూ దేశమూ లేదన్నారు. హిందువల ప్రేమ, ఆప్యాయత, అనురాగాల వల్లే అన్య మతాలు దేశంలో పాతుకుపోయి వెన్నుపోటు పొడుస్తున్నాయన్నారు. అలాంటి వాటికి కాలమే సమాధానం చెప్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాదూరావునామాజీ, పగడాకుల శ్రీనివాసులు, హిందూ ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ రాంబుబు, సత్యయాదవ్, డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, క్యాతన్ రఘునాథ్, అప్పిరెడ్డిపల్లి రాము, రఘురామయ్య గౌడ్, కన్న శివుడు, ప్రవీణ్, దూస సీతా రాములు, నర్సింహులు, సందీప్, శ్రీపాద్, వడ్ల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణపేటలో ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న స్వామీజీ, పాల్గొన్న నాయకులు

నీటి గుంతలో పడి యువరైతు మృతి



కృష్ణ (ఫైల్)

బిజినేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు తన పొలంలోని నీటి గుంతలో పడి యువరైతు అస్కని కృష్ణ (28) మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నల్కర్‌పేట గ్రామానికి చెందిన కృష్ణ తన మూడు ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. పొలంలోని నీటిగుంతలో మోటరు ఏర్పాటు చేసుకొని పంటకు నీరి పారించేవాడు. బుధవారం సాయంత్రం మోటరు పైపుకు చెత్త అడ్డుపడటంతో నీటి ప్రెషర్ తగ్గింది. దీంతో చెత్తను తొలగించే ప్రయత్నంలో కృష్ణ నీటిలో జారి పడ్డాడు. అతడికి ఈత రాకపోవడం, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. చీకటి పడినా భర్త ఇంటికి రాక పోవడంతో భార్య లావణ్య బంధువులకు సమాచారం ఇచ్చింది. వారితో కలిసి పొలం వద్దకు పరిశీలించగా నీటి గుంత వద్ద కృష్ణకు సంబంధించిన దుస్తులు, చెప్పులు కన్పించాయి. అనుమానంతో అందులో గాలిం చగా మృతదేహం లభ్యమైంది. సంఘటనపై మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నలుగురి రిమాండ్

వనపర్తి క్రైమ్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగ చోరీ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. వనపర్తి పట్టణంలోని తిరుమల కాలనీకి చెందిన హరీశ్ ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ తీగను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పట్టణ సమీపంలోని భగీరథ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటో అనుమానాస్పదంగా కనిపించింది. దానిని తనిఖీ చేయగా విద్యుత్ తీగ లభించింది. ఈ కేసులో యాదగిరి, నవీన్, చిన్న, గిరిధర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 300 కిలోల తీగ, ఆటో, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ప్రేమ పేరుతో మోసం : పోలీసులకు ఫిర్యాదు

జడ్చర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని, అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో మోసం చేశాడు. తీరా పెళ్లి చేసుకోవాలని అడగడంతో గ్రామం వదిలి పారిపోయాడు. ఆ యువకుడు ఐదు సంవత్సరాలుగా ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంట తిరిగాడు. నమ్మించి అన్ని విధాలా మోసం చేశాడు. గర్భవతి కావడంతో అబార్షన్ చేయించాడు. తనను పెళ్లి చేసుకోవాలంటూ ఆ యువతి ఒత్తిడి చేయడంతో గ్రామం నుంచి పారిపోయాడు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఆమె తల్లిదండ్రులతో కలిసి గురువారం జడ్చర్ల పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కేటీదొడ్డి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద గురువారం తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేస్తుండగా, రాయచూరు వైపు వెళుతున్న బొలెరో కన్పించింది. తనిఖీ చేయగా అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. దీంతో వాహనంతో పాటు 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ధరూర్‌కు చెందిన సహదేవ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తిమ్మప్ప స్వామి సన్నిధిలో ఇంటలిజెన్స్ డీజీపీ



ఆలయంలో పూజలు చేస్తున్న డీజీపీ, కుటుంబసభ్యులు

వడ్డేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంలో కొలువైన గట్టు తిమ్మప్ప స్వామిని గురువారం తెలంగాణ ఇంటలిజెన్స్ డీజీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. సతీ సమేతంగా క్షేత్రానికి వచ్చిన ఆయనకు అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు తరాల నుంచి తమ వంశీయులు ఆలయాన్ని దర్శించుకుంటున్నారని తెలిపారు. అలాగే తాను కూడా ప్రతి సంవత్సరం కుటుంబంతో కలిసి తిమ్మప్ప స్వామికి పూజలు చేస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికకు ఈనెల ఏడున పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహించనున్న ఈ పోటీలకు 2010, అక్టోబరు ఒకటి తరువాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-14 అంతర్‌జిల్లా క్రికెట్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు భరించలేక కొట్ట నాగరాజు (55) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై ఎస్ఐ గోవర్ధన్ వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నాగనూలు బీసీ కాలనీకి చెందిన నాగరాజు కుటుంబంలో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. వాటిని భరించలేక గురువారం రాత్రి ఇంట్లోనే చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య లక్ష్మమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటర్వ్యూ..

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ డాక్టర్ రాహుల్



చిన్నచింతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చలికాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నచింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాహుల్ సూచించారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

చలికాలంలో ఎలాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది?

డెంగీ, చికున్‌గున్యా, మలేరియా ప్రబలే అవకాశం ఉంది.

మండలంలో ఏ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి?

ఇప్పటికే చాలా మంది గొంతు నొప్పి, మంటగా ఉండటం, జలుబు, దగ్గు, టైఫాయిడ్ వంటివి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలి. దగ్గు ఉన్న వారికి కొంత దూరంగానే ఉండాలి.

పీహెచ్‌సీలో మందులు, సిబ్బంది కొరత ఉందా?

ఇప్పటికీ మందుల కొరత లేదు. పాము, కుక్క కాటుకు కూడా టీకా అందుబాటులో ఉంది. మండలంలో ఎనిమిది సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో ఐదింటిలో ఎంఎల్‌హెచ్‌పీ ఖాళీలు ఉన్నాయి.

న్యూస్ బాక్స్

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

పాలమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు.

కళాశాలకు కంప్యూటర్ వితరణ

చిన్నచింతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సొంత నిధులతో కంప్యూటర్, స్కానర్, ప్రింటర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణికి అందజేశారు.

పేదలకు పండ్లు పంపిణీ

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ వలంటరీ దినోత్సవం పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ పరిసరా ప్రాంతాల్లో పేదలకు అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

రేపు కవి సమ్మేళనం

పాలమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కవి సమ్మేళనం-ముషాయిరాను శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆహ్వాన సంఘం ప్రతినిధులు కె.లక్ష్మణ్‌గౌడ్, ఖలీల్, బోల యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కవులు సామరస్య ప్రజాజీవనం - లౌకికతత్వం కవి సమ్మేళనం శీర్షిక ఉంటుందని దానికి కవులు కవితా గానం చేయాలన్నారు.

మార్కెట్‌లో ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డుకు గురువారం ధాన్యం పోటెత్తడంతో కళకళలాడింది. ఆర్ఎన్ఆర్ 115 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,682, కనిష్ఠంగా రూ.2,332 పలికింది. హంస 25 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2050, కనిష్ఠంగా రూ.2049 పలికిందని మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

కోయిలకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా టీకాలు వేయించుకోవాలని డాక్టర్ ప్రవీణ్ సూచించారు. గురువారం మండలంలోని తిర్మలంపల్లిలో నిర్వహించి పశువైద్య శిబిరంలో పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులు పశువులకు సమయానికి టీకాలు వేయించాలని లేకపోతే అవి సూడి తప్పుతాయని అన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చిన్నచింతకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, నాయకులు ప్రేమయ్య, డేవిడ్ పేర్కొన్నారు. గురువారం తెలంగాణ బీడీ కార్మిక సంఘం టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మండలంలోని దమగ్నాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సాయితేజరెడ్డి

మహమ్మదాబాద్ డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సాయితేజారెడ్డి గెలుపొందారు. ఆన్‌లైన్ విధానంలో జరిగిన ఎన్నికల్లో 113 రాగా, 30 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

బాధిత రైతులను ఆదుకుంటాం

కోయిలకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇబ్రహీంనగర్‌లో అడవీ జంతువుల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లల రైతులను ఆదుకుంటామని అటవీ శాఖ సెక్షన్ అధికారి మౌనిష తెలిపారు. గురువారం ఇబ్రహీంనగర్‌లో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించి నష్టపరిహారం అందించుటకు కృషి చేస్తా మని తెలిపారు. బీట్ అధికారి శశికళ, ఎంపీ టీసీ మాజీ సభ్యుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీలో తప్పులు సవరించాలి

▸▸ కలెక్టర్ విజయేందిర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సర్వే డేటా ఎంట్రీలో తప్పులుంటే సవరించాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. గురువారం మయూరీ ఎకో పార్క్ సమావేశ మంది రంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్ర త్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, ధరణి, సీఎం కప్, గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. సమగ్ర ఇంటింటి సర్వే, గ్రామ పంచాయతీ వార్డుల వారీగా డేటాను కుటుంబాల సంఖ్య పరిశీలన చేయాలని, తప్పులు ఉంటే సరిచేయాలని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను మండలాల వారిగా సమీక్షిస్తూ ధరని పోర్టల్‌లో 585 పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా వచ్చిన ఫారం 6,7,8 దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం గుర్తించిన పోలింగ్ కేంద్రాల జాబితా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆమోదంతో ఈనెల 7న ముసాయిదా జాబితా ప్రచురించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ముసాయిదా జాబితాపై ఈనెల 7 నుంచి 12 వరకు అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి పరిష్కరించాలని, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆమోదంతో ఈనెల 17న తుది జాబితా ప్రచురించాలని సూచించారు. సీఎం కప్ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

▸▸ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



నూతన ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మమబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని న్యూగంజ్ సింహగిరి లక్ష్మీ నరసింహ్మస్వామి ఆలయ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని శివశక్తినగర్‌లో గల శివాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారానికి పాల్గొని ఆలయ ఇన్‌స్పెక్టర్ వీనాద్రితో ప్రమాణం చేయించారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహ్మరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనితరెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది విజయ్‌కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఈవో రంగాచారి పాల్గొన్నారు.

రాబోవు రోజుల్లో ఆర్టీసీకి స్వర్ణయుగం

మహబూబ్‌నగర్ టౌన్ : రాబోవు రోజుల్లో ఆర్టీసీకి స్వర్ణయుగం రాబోతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమానికి ఆయన పాల్గొని, మాట్లాడారు. మహిళలకు చిన్నపిల్లలకు మరియు ఫీడింగ్ మదర్స్‌కి ఒక రూమ్‌తో పాటు గ్రంథాలయం ఏర్పాటు చేస్తామ హామీ ఇచ్చారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన మహిళా కండక్టర్లు యాదమ్మ, అపర్ణను ఘనంగా సన్మానించారు.

విద్యాభివృద్ధికి నిరంతరం కృషి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : ప్రభుత్వం విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని, పాలమూరు జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి హాజరై మాట్లాడారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి సీరాజ్‌ఖాద్రి, ప్రిన్సిపాల్ భగవంత చారి, బాలిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్ జహన్, పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు



పశువైద్యశాల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జీఎంఆర్

మూసాపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి తట్టుకోలేని కొందరు ప్రతిపక్ష పార్టీలు అర్థ రహిత ఆరోపణలు చేయడం ఏ మాత్రం సబబు కాదని, అట్టి వారికి రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను ప్రారంభించారు. పశువైద్యాధికారి సింధూజ విజ్ఞప్తి మేరకు పశువైద్యశాలను పరిశీలించి కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదనలు పం పాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలనర్సింహులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎంపీడీవో కృష్ణయ్య, డీటీ వినోద్‌కుమార్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, నిరంజన్, సత్యనారాయణ, గోవర్ధన్, మహేందర్, కృష్ణయ్య, శెట్టి శ్రావణ్‌కుమార్, నారాయణ, శ్రీనివాసులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు స్వచ్ఛమైనది

హన్వాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మిషన్ భగీరథ నీరు స్వచ్ఛమైనవని మిషన్ భగీరథ ఎస్ఈ జగన్‌మోహన్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం హన్వాడలో అన్ని ట్యాంకులు, కుళాయిలు పరిశీలించారు. ఏఈ యాదయ్య, కార్యదర్శి దీప్తి పాల్గొన్నారు.

రేపు రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్

జడ్చర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి ఉచిత బస్సు పథకంతో ఆటో, క్యాబ్ డ్రైవర్‌లు నష్టపోతున్నారని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న ఆటో, క్యాబ్‌లు రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగుసత్తయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మూసాపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి ఏఎంవో శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చక్రాపూర్ యూపీఎస్ పాఠశాలను తనిఖీ చేసి, రికార్డులు, గ్రంథాలయ పనితీరు, కిచన్ గార్డెన్‌ను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం నారాయణ, విద్యాలత, సురేష్, మోహన్‌బాబు, మాధవి ఉన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

దేవరకద్ర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప నామస్మరతో దేవరకద్ర పట్టణం మార్మోగింది. గురువారం మండల కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో కర్ణంరాజు గురుస్వామి అధ్వర్యంలో అయ్యప్ప భక్తులు వైభవంగా పడిపూజ నిర్వహించారు. అంతకుముందు అయ్యప్ప శోభాయాత్రను నిర్వహించారు.

క్రీడాకారులను వెలుగులోకి తేవాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయిలోనే క్రీడాకారులను వెలుగులోకి తేవాలని తెలంగాణ ఫిజికల్ డైరెక్టర్స్ మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ అన్నారు. 2024 డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎన్నికైన మహేష్‌చంద్ర, రవికాంత్, వెంకటేష్, రాకేష్‌కుమార్, శ్రీనివాస్‌నాయక్, శివప్రసాద్‌ను గురువారం జిల్లా స్టేడియంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌తో కలిసి సన్మానించారు. టీజీపీడీ, పీఈటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విలియమ్, కృష్ణ, బాధ్యులు ఆనంద్‌కుమార్, వడెన్న పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు కట్టుబడి ఉండాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అవినీతి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కట్టుబడి ఉండాలని ఎస్పీ జానకి అన్నారు. గురువారం అవినీతి నిరోధక వారోత్సవాల అవగాహన ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఏసీబీ సిబ్బంది, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులతో తీసిన ర్యాలీ పోలీస్‌లైన్ స్కూల్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అవినీతి నిరోధక వారోత్సవాలను ప్రతీ ఏటా డిసెంబరులో నిర్వహిస్తున్నారని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం అభినందనీయం అన్నారు. అవినీతికి పాల్పడటంతో పాటు అవినీతిని ప్రోత్సహించడం కూడా నేరమే అన్నారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు సయ్యద్‌అబ్దుల్ ఖాదర్ జిలాని, లింగస్వామి, ఎంఈవో లక్ష్మణ్‌సింగ్, డీఈవో కార్యాలయ సూపరింటెం డెంట్ శంబుప్రసాద్, ఆర్వీఎంవో బాలుయాదవ్ పాల్గొన్నారు.

పథకాల అమలే ప్రభుత్వ లక్ష్యం

▸▸ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

▸▸ నేను గెలవకుంటే ముదిరాజులు ఆగమే : మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మార్కెట్ కమిటీ చైర్మన్ లింగంతో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, నాయకుడు దుశ్యంత్ రెడ్డి

నవాబ్‌పేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పథకాల అమలే ప్రభుత్వ లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలాజీ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్ర మంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి చైర్మన్ లింగం, వైస్ చైర్మన్ తులసీరాం, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత రైతులకు రైతు భరోసా అమలు అవుతుందన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ తనను ముదిరాజ్ బిడ్డలు గెలిపించడం వల్లే అసెంబ్లీలో వారి తరఫున మాట్లాడే గొంతుకన య్యానని, లేదంటే వారు ఆగమయ్యే వారు అన్నారు. నాయకులు దుశ్యంత్‌రెడ్డి, రంగారావు, జహీర్ అక్తర్, దార బాస్కర్, సేవాదళ్ నాయకులు వాజీ ద్ మహేక్, హమీద్ మహేక్, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి

రాజాపూర్ : నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుచ్చర్‌కల్ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన ప్రహరీ ప్రారంభించి, విద్యార్థులకు సొంత ఖర్చులతో బూట్లు పంపిణీ చేశారు. గ్రా మంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను ప్రారంభించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జడ్చర్ల : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం జడ్చర్ల పట్టణంలోని చంద్రాగార్డెన్స్‌లో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి పథకంలో ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షల చొప్పున రుణం అందజేస్తోందని, జడ్చర్ల మునిసిపాలిటీకి 38 యూనిట్లు మంజూరీ కాగా, 30 యూనిట్లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.1.50కోట్ల రుణాల చెక్కులు అందచేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్, బాదేపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, కౌన్సిలర్లు చైతన్యచౌహాన్, రమేశ్ పాల్గొన్నారు.

భూమి అపారమైన వనరు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్

పాలమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మనుషుల కిచ్చే వనరుల్లో భూమి ప్రధానమైందని జిల్లా వ్యవసాయాధికారి బి.వెంకటేష్ అన్నారు. గురువారం దివిటిపల్లి రైతువేదికలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన భూమిని అందించటమే మన కర్తవ్యమన్నారు. సహజ సూక్ష్మజీవుల సంరక్షణ, అధిక రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకంతో జీవరాసులు నష్టపోతున్నాయని తెలిపారు.

● కోయిలకొండ : రైతులు భూములను భూసార పరీక్షలు నిర్వహించుంటే అధిక దిగుబడి పొందుతారని ఏవో యామరెడ్డి సూచించారు. శ్రీరామకొండ రైతు వేదికలో ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని నిర్వహించి రైతులకు భూసారంపై అవగాహన కల్పించారు.

● జడ్చర్ల : నేల సంరక్షణలో ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఉండాలని మండలంలోని జడ్చర్ల, పోలేపల్లి, పెద్దఆదిరాల, ఆలూరు, మల్లెబోయిన్‌పల్లి, కొండేడు, కోడ్గల్, గంగాపురం, నసరుల్లాబాద్ రైతు వేదికలలో రైతులు ప్రతిజ్ఞ చేసారు. గురువారం ప్రపంచ మృత్తిక దినోత్సవాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏవో గోపీనాథ్ పాల్గొన్నారు.

● మూసాపేట : ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా మండలంలోని జానంపేట, మూసాపేట, పోల్కంపల్లి రైతు వేదికలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. భూమి సారవంతమైన నేలలు, మృత్తిక పరిరక్షణ, మట్టి నమూనాలపై రైతులకు వివరించారు. జడ్చర్ల ల్యాబ్ ఏవో ప్రత్యూష, ఏవో అనీల్‌కుమార్, పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేస్తాం

జడ్చర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీని బలోపేతం చేసి, పూర్వవైభవం తీసుకొస్తామని ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సిములు అన్నారు. గురువారం జడ్చర్ల పట్టణంలో టీడీపీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా సభ్యత్వాల నమోదును చేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

మహబూబ్‌నగర్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరు గ్రామంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం ఆరు గ్యారెంటీలపై కళాకారులు ఆట పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారు. మహబూబ్‌నగర్ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్ ముదిరాజ్, గ్రామ ఇన్‌చార్జి సెక్రెటరీ సునిత, ప్రసాద్, నాయకులు కృష్ణయాదవ్, చందు ముదిరాజ్ పాల్గొన్నారు.

పీయూలో కొనసాగిన ఇంటర్వ్యూలు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తి చేసుకున్న విద్యార్థులకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం పీబీ సేల్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సెలక్టయిన విద్యార్థులకు వారంలోగా షార్ట్‌లిస్ట్ ప్రకటిస్తామని, అనంతరం బ్యాంకు అధికారులు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారని డాక్టర్ చంద్రకిరణ్ తెలిపారు. ఎంబీఏ విద్యార్థులకు ప్రతీ సంవత్సరం ప్లేస్‌మెంట్ నిర్వహించడంతో ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎస్.ఎన్ అర్జున్ కుమార్‌ను పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అభినందించారు.

వంటగదిని శుభ్రంగా ఉంచుకోవాలి

జడ్చర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత సిబ్బందికి సూచించారు. జడ్చర్ల మునిసిపాలిటీ నాగసాల సమీపంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. వంటగది, తరగతి గదులు, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ పారిజాతకు సూచించారు. కౌన్సిలర్లు నవనీత, రఘురాం గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పిట్టలమురళి, నర్సిములు, రాంమోహన్, కొండల్, ధానీష్, మసియొద్దీన్, ముఖీద్, అజహర్, హబీబ్ పాల్గొన్నారు.

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు అన్నారు. గురువారం స్థానిక సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో డిజిటల్ నేరాలపై హెల్పేజ్ ఇండియా వారి సౌజన్యంతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుతున్న సమాజంలో డిజిటల్ ప్రపంచం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండటంతో అమాయకులను ఇట్టే మోసం చేస్తున్నారన్నారు. అపరిచితులు పంపే మెసేజ్‌లకు జవాబు ఇవ్వకూడదన్నారు. హెల్పేజ్ ఇండియా కో-ఆర్డినేటర్ శ్యాం డిజిటల్ అరెస్టులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలో తల్లిదండ్రులు తమ పిల్లలకు చెప్పాలని, వీలునామా రాసేప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

క్రిమీలేయర్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓబీసీ క్రిమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఐఓబీసీ) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి పాల్గొని మాట్లాడారు. కుల గణన చేయాలని, రిజర్వేషన్లలో 50శాతం పరిమితిని తొలగించాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. న్యాయ వ్యవస్థలో ప్రైవేట్ సెక్టార్‌లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఓబీసీ సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రెగ్యులరైజ్ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

భూత్పూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ భూత్పూర్ ఎమ్మార్సీ కార్యాలయ కాంట్రాక్టు (సమగ్ర శిక్షా అభియాన్) ఉద్యోగులు గురువారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. గత ఎన్ని కల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మార్సీ కార్యాలయంలో కాంట్రాక్టు బేసిక్ మీద పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా మా గురించి పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేయాస్తామని సీఆర్‌పీ విక్రం స్పష్టం చేశారు. ఇంతియాజ్, కవిత, కరీం, నాగేందర్, ఠాకూర్, గీత, చైతన్య, నాగజ్యోతి, నాగరాజు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మహమ్మదాబాద్/గండీడ్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మహ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. వెంకటరెడ్డిపల్లి గేటు దగ్గర పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఆటోని తనిఖీ చేయగా, ఐదు సంచుల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా హన్వాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బోగారం కృష్ణయ్యపై కేసు నామోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్లు 20 శాతానికి పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

పాలమూరు/దేవరకద్ర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్లు 20 శాతానికి పెంచాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో మాదిగల అసెంబ్లీ నియోజకవర్గాల సమ్మేళనంలో భాగంగా ఆయన మాట్లాడారు. దేశంలో పంజాబ్ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు పెంచిందని గుర్తుచేశారు. రెండు శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్రానికి దేశంలో అత్యధికంగా ఉన్న మాదిగలకు 20శాతం రిజర్వేషన్లు పెంచటం ఎందుకు సాధ్యం కాదన్నారు. అదే విధంగా దేవరకద్ర మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మార్కెట్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్, రాష్ట్ర నాయకుడు మొగ్గులయ్య, నాయకులు రాము, రామస్వామి, వెంకట్‌నర్సిములు, రామాంజనేయులు, ప్రసాద్, రామకృష్ణ, కరణకర్, రాము, రాజు, రాయికంటి రాందాసు, సాయిబాబా, సింగిరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.